క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ఎన్నికలు..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న 8 స్థానాలకు జరగనున్నాయి. ఐదు స్థానాలు ఏకగ్రీవం కాగా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మహిళా ప్రతినిధి స్థానాలకు పోటీలు జరగనున్నాయని ఎలక్షన్ అధికారి పలివేల గణేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష బరిలో లక్కినేని సత్యనారాయణ, ఎస్‌వి రాజేష్, ఏ.రాంప్రసాద్ నిలిచారు. అదేవిధంగా వైస్ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు ఏకగ్రీవం కాగా, జనరల్ సెక్రటరీలుగా పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర పోటీలో ఉన్నారు. జాయింట్ సెక్రటరీగా ఎస్.ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్ కరుణకుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డి.రవికుమార్, లైబ్రరీ సెక్రటరీ ఎండీ సాధిక్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. మహిళా ప్రతినిధులుగా ఎండీ షాజహాన్ పర్వీన్, ఎన్.ప్రతిభ పోటీలో ఉన్నారు.

ఉపాధ్యక్షుడిగా మల్లేశ్...



కొత్తగూడెం బార్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా తోట మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు శుక్రవారం ఎలక్షన్ సభ్యులు పేర్కొన్నారు. 2024–25 ఏడాదికి గాను జరిగిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ



రీడింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నోడల్ ఆఫీసర్ జి.మల్లికార్జున్ నేతృత్వంలో అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ ఆఫీసర్ మల్లికార్జున్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణపై ఆరా తీశారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ట్రిప్ కాకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఈ నందయ్య, ప్రొడక్షన్ ఏడీఈ రవి, ఏడీఈ యాసిన్, జూలూరుపాడు ఏఈ సతీష్ పాల్గొన్నారు.

కూలర్ వితరణ



కూలర్ అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో దోసపాటి రాము, ఉష దంపతులు జిల్లా గ్రంథాలయానికి కూలర్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా జూలూరి ఆనంద్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ సేవలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.వరలక్ష్మీదేవి, జి.మణిమృదుల, గునిపాటి సుధాకర్, దార రమేష్, సురేష్, గణేష్ కోయాడ నగేష్, కొదుమూరి సత్యనారాయణ, నరేంద్ర, ఋషి కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పాల్వంచరూరల్: ఇంట్లో నుంచి ఓ యువతి అదృశ్యమైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి పాండురంగాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూక్యా విజయలక్ష్మి(19) గురువారం ఇంట్లో అందరితోపాటే ఉంది. తెల్లవారి సరికి కనిపించడం లేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని తల్లి శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జెన్‌కో కార్మికుల హర్షం

పాల్వంచ: జెన్‌కో సంస్థలో రెండోసారి కారుణ్య నియామకాలను పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై పలు కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్మికులకు వ్యతిరేకంగా ఇచ్చిన జీఓ 6ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు పలువురు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గతంలో రెండోసారి కారుణ్య నియామకాలు చేపట్టాలని పలుమార్లు జెన్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి జీఓ రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సీఎండీ రిజ్వీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్, రాధాకృష్ణ, పుట్టా నాగేశ్వరరావు, ధనయ్య, రామారావు, ఎస్.శ్రీనివాసచారి, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, శివరాం, సయ్యద్ మజీద్ పాల్గొన్నారు.

ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీ‘జులుం’

- మున్సిపాలిటీలో చిరువ్యాపారులపై బహుభారం
- చదరపు అడుగుకు రూ.100 వసూలుకు నిర్ణయం
- ససేమిరా అంటున్న దుకాణదారులు
- చెల్లించని షాపులకు తాళాలు



నోటీసులు అందుకున్న చిరువ్యాపారుల షాపులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో రోడ్డు మీద చిరువ్యాపారం చేసుకునే వారి నుంచి మున్సిపాలిటీ వారు విచ్చలవిడిగా ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడిచి రోడ్డు మీద నిలువ నీడ లేని ఎన్నో కుటుంబాలకు ఫుట్‌పాత్ నీడ నిస్తోంది. వారిపై మున్సిపల్ అధికారులు కన్నేశారు. వారం రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది ఫుట్‌పాత్ వ్యాపారానికి స్థలం కొలతలు వేసి ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి మున్సిపల్ సిబ్బంది వచ్చి ఎన్‌క్రోచ్‌మెంట్ స్థలానికి ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

చిరువ్యాపారులకు సంకటం..

ఇల్లెందులో రోడ్డు మీద చిరువ్యాపారం చేసుకునే వారికి వ్యాపారం బహుభారంగా మారింది. రోడ్డు వెంట కొన్ని ఏళ్ల నుంచి చిరువ్యాపారం చేసుకుంటున్నవారు ఆ ప్రభుత్వ స్థలంలో చిన్నచిన్న గదులు ఏర్పాటు చేసుకున్నారు.

అలాంటి వారు ఈ రోజు వ్యాపారంలో నష్టాలు రావడమో, వ్యాపారం చేసుకునే స్థోమత లేకపోవటం వల్లనో ఆ గదులను ఇతరులకు కిరాయికి ఇచ్చుకున్న వారు నెలనెలా ఆ ఓనర్‌కు రూ.2 వేలు నుంచి రూ.3 వేలు కిరాయి చెల్లిస్తున్నారు. ఇక ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.35 వేల వరకు చెల్లించాలని నోటీసు జారీ చేయడంతో వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక రోజంతా నాలుగు చక్రాల బండి మీద తినుబండారాలు, పండ్లు అమ్ముకునే వారికి కూడా రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు విధించటంతో లబోదిబోమంటున్నారు.

రూ.వేలల్లో వసూళ్లకు నిర్ణయం..

పట్టణంలోని గోవింద్ సెంటర్ నుంచి జేకే ఏరియా వరకు మున్సిపాలిటీ పరిధిలో ఫుట్‌పాత్ మీద చిరు వ్యాపారం చేసుకునే వారికి రూ.వేలకు వేలు ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు విధించటంతో లబోదిబోమంటున్నారు. పట్టణంలో రోడ్డు మీద ఫుట్‌పాత్ మీద చిరువ్యాపారం చేసుకునేవారు నేరుగా మున్సిపాలిటీకి ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించాలని, ఇతరులకు మధ్యవర్తులకు ఎలాంటి ఫీజులు చెల్లించ రాదని మున్సిపాలకులు సెలవిస్తున్నారు. ఇక రోడ్డు మీద వారు వాడుకునే స్థలానికి చదరపు అడుగుకి రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక్కో చిరువ్యాపారి నెలకు రూ.2 నుంచి రూ.3 వేలకు పైగా చెల్లించాల్సి రావటం, ఏడాది ఫీజు ఒకేసారి చెల్లించాలని నోటీసు అందజేయటంతో చిరువ్యాపారులు పరేషాన్ అవుతున్నారు.

ససేమిరా అంటున్న చిరు వ్యాపారులు..

మున్సిపల్ పాలకులు చదరపు అడుగుకి రూ.100 చొప్పున ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించాలని నోటీసులు జారీ చేయటంతో చిరువ్యాపారులు ససేమిరా అంటున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము ఫీజు కింద చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏడాదికి రూ.15 నుంచి రూ.35 వేల వరకు ఫీజు విధిస్తే తాము బతికేది ఎట్లా అంటున్నారు. అటు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇటు ఎమ్మెల్యే కోరం కనకయ్య చెంతకు చేరి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు భరించలేమని, తమకు న్యాయం చేయాలని ఉపాధి మార్గం చూపాలని వేడుకుంటున్నారు.



ఫీజు చెల్లించలేదని తాళం వేసిన షాపు

చెల్లించని షాపులకు తాళాలు..

వారం రోజుల క్రితం ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజుల కోసం నోటీస్‌లు అందజేసిన మున్సిపల్ యంత్రాంగం రెండు రోజుల నుంచి వసూళ్ల మీద దృష్టి సారించారు. చెల్లించని గదులకు తాళాలు వేయటమో లేక మున్సిపల్ వాహనంలో తరలించటమో చేసేందుకు సిద్ధం అవుతున్నారు. కళాంజలి పెట్రోల్ బంక్ ఎదుట ఓ మెకానిక్ షాపు నిర్వాహకుడు అటు ఓనర్‌కు కిరాయి చెల్లిస్తున్నామని, ఇటు మున్సిపాలిటీకి ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు ఎలా చెల్లించాలని ససేమిరా అనటంతో ఆ షాపులకు తాళం వేశారు.

కిరాయి చెల్లిస్తున్నా..



నాది చిన్న షెట్టర్. మెకానిక్ షాపు నడిపించుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు రూ.35 వేలు వేశారు. నావల్ల కాదనడంతో గదికి తాళం వేశారు. ప్రతీనెల ఓనర్‌కు రూ.2 వేలు కిరాయి చెల్లిస్తున్నా. అంతేకాదు మిర్చి బజ్జీల బండికి కూడా రూ.14 వేల ఫీజు చెల్లించమంటున్నారు. ఎలా సాధ్యం అవుతుందో అర్థం కావటం లేదు

– గౌస్‌పాషా, మెకానిక్ షాపు

రూ. 20 వేలు చెల్లించమంటున్నారు..



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కొబ్బరి బొండాలు, పండ్లు, బ్రెడ్డు అమ్ముకునే చిరువ్యాపారానికి ఏడాదికి రూ.20 వేలు ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు విధించారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. గతంలో రూ.వెయ్యి వసూలు చేసేవారు. ఇప్పుడు రూ. 20 వేలు చెల్లించమంటున్నారు. అంత వ్యాపారం మాకు లేదు కదా.. ఎలా చెల్లించాలి.

– మహేష్, కొబ్బరి బొండాల వ్యాపారి

సమాచార హక్కు చట్టంపై శిక్షణ



మాట్లాడుతున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ–2005)పై రీజియన్‌లోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల ప్రజా సమాచార అధికారులకు (పీఐఓ), అదనపు ప్రజా సమాచార అధికారులకు (ఏపీఐఓ), ఉద్యోగులకు శుక్రవారం కొత్తగూగెం కార్పొరేట్ ఏరియాలోని ఇల్లెందు క్లబ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ... సామాన్యుడు తనకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి రాబట్టడం కోసం భారత ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టాన్ని దేశమంతటా అమల్లోకి తెచ్చిందన్నారు. అలాంటి సమచారం హక్కు చట్టంపై సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అవగాహన పెంపొందించేందుకు హిందుస్తాన్ అకాడమీ ఆఫ్ లా విశాఖపట్టణం ప్రొఫెసర్ వి.పార్వతీశం వారిచే రెండు రోజులు శిక్షణ తరగతులను నిర్వహించటం జరిగిందన్నారు. ఈ తరగతుల్లో ఉద్యోగులు అవగాహన పెంచుకొని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంస్థ నిబంధనలకు లోబడి కోరిన సమాచారాన్ని సకాలంలో ఇవ్వాలని సూచించారు. అనంతరం వి.పార్వతీశం, రాజేశ్వరి సమాచార హక్కు చట్టానికి సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేస్ స్టడీస్ రూపంలో వివరించారు.

ఈ కార్యక్రమంలో జీఎం (హెచ్‌ఆర్‌డీ) వి.కృష్ణయ్య, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, వివిధ ఏరియాల ఉద్యోగులు, హెచ్‌ఆర్‌డీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కక్షలు ఆవేశాలు వదిలేయండి





హాజరైన రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు, మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మనమంతా కేంద్ర ఎన్నికల కోడ్ పరిధిలో ఉన్నాం. నిబంధనలకు లోబడి అందరూ వ్యవహరించాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు, యూత్ నాయకులు, వివిధ సంఘాల నాయకులకు పార్లమెంట్ ఎన్నికల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. స్థానిక సంబంధాలు, స్నేహాలు శాశ్వతంగా ఉంటాయని, ఎన్నికల నేపథ్యంలో ఎవరు క్షణికావేశాలకు లోను కావద్దని, రాజకీయ కక్ష పెంచుకోవద్దని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, యూత్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఒకరికొకరు దూషించుకోవడం, సోషల్ మీడియా వేదికగా తప్పుడు, అసభ్యకర మెసేజ్‌లు పెట్టడం లాంటివి చేయొద్దన్నారు. ఓటర్లకు తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసే హక్కు ఉంటుందని వారిని స్వేచ్ఛగా నచ్చిన వారికి ఓటు వేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. ఎవరైనా ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినా, ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా 100 నంబర్‌కు కానీ, స్థానిక పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగాలన్నదే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందని ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికుడు కణతాల వసంతరావు మాట్లాడుతూ.. గ్రామాలో ఘర్షణలకు కారణం బెల్టుషాపులని, ఎన్నికల సమయంలో బెల్టుషాపులు మూసివేయించాలని డీఎస్పీని కోరారు. ఇందుకు డీఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బోడిక నరసింహారావు, భాను, రమణ, సాగర్, కె.రవి, ఉపేందర్, కోటి, రమేష్, రవి, సామ్యేల్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం..



నిరసన తెలుపుతున్న నాయకులు

పాల్వంచ: మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్‌కుమార్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ, ఏఐసీసీల అన్ని ఖాతాలను స్తంభింపజేయడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ... యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లకు వివిధ రూపాల్లో వచ్చిన విరాళాలను స్తంభింపజేయడం చట్ట విరుద్ధం అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోదీ ఇలా చేయడం సరికాదని, బీజేపీ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు గద్దం రాజశేఖర్, యూత్ అధ్యక్షుడు హెచ్.మధు, మండల యూత్ అధ్యక్షుడు భూక్యా గిరిప్రసాద్, భట్టు మురళీనాయక్, రాంబాబు, నసీం, ప్రవీణ్, పవన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా ఖాజామియా

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ ఖాజామియా నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖాజామియా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ నాయకులు ఎండీ గౌస్ మొయినుద్దీన్, ఎండీ ఖాజా ఖురేషి తదితరులు ఖాజామియా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఇంటి పన్నులు చెల్లించండి

కొత్తగూడెంఅర్బన్: ఇంటి పన్నుల బకాయిలు చెల్లించడానికి ఇంకా తొమ్మిది రోజులు గడువు మాత్రమే ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఇంటి పన్ను బకాయిలు ఉన్న గృహ, వాణిజ్య యజమానులకు వడ్డీలో 90 శాతం రాయితీని కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 90 శాతం వడ్డీ రాయితీని మార్చి 31 వరకు చెల్లించాలని కోరారు. ప్రజలందరూ ఇంటి పన్నులు చెల్లించి కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం..



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో మూడు జనరల్ అసెంబ్లీ స్థానాల్లో అగ్రవర్ణాల వారే గెలుపొందారని, అన్నిపార్టీలు అగ్రవర్ణాల వారికే టికెట్లు కేటాయిస్తున్నారని ఒక్క బీఎస్పీ మాత్రమే జనరల్ స్థానాల్లో బీసీ, ఎస్సీలకు టికెట్లు కేటాయించినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో భర్త రాజకీయాల్లో ఉంటే భార్యకు, అన్న మంత్రిగా ఉంటే తమ్ముడికి, తండ్రి మంత్రిగా ఉంటే తనయుడికి టికెట్ కోసం చేస్తున్న ప్రయత్నాలను బహుజన సమాజం గమనించాలన్నారు. మనం ఉంటున్నది రాచరికంలో కాదని ప్రజాస్వామ్యం అని కులాలు, మతాలకు సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు దాటినా ఇంకా కుటుంబ పాలన కొనసాగుతోందని, ఇది కాంగ్రెస్ పార్టీకే నష్టమని జనాభాలో 90 శాతానికి పైగా ఉన్న బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాగుల రవికుమార్, వంగా రవిశంకర్, కొండ విజయ్‌భాస్కర్, నన్ను తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరణ



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న పీవైఎల్ నాయకులు

ఇల్లెందురూరల్: మర్రిగూడెం గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతి ప్రచార పోస్టర్లను పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు చింత నర్సింహారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టినప్పుడే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. చట్ట సవరణ పేరుతో మూడు వ్యవసాయ చట్టాలను అమలు చేసేందుకు యత్నించడం, కార్మికుల హక్కులను కాలరాసే చట్టాల అమలుకు పూనుకోవడం నిర్ణయాలను ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించడం వల్లే కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధి రంగాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జోగ కాంతారావు, ఉదయ్, కోటన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని శనివారం వాడవాడలా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ఉద్యమించాలన్నారు. దేశసంపదను అదాని, అంబానీలకు దోచిపెట్టడమే జాతీయవాదమా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న ‘పాలకవర్గం’



పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయం పాలక ధర్మకర్తల మండలి కమిటీ పదవీకాలం రేపటితో ముగియనుంది. ఈసారి చైర్మన్, డైరెక్టర్లను ఎవరిని నియమిస్తారోనని చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోనే భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయం తర్వాత అంతటి ఆదాయం, భక్తుల రద్దీ కలిగిన పాల్వంచ మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పాలకవర్గం గతేడాది మార్చి 23న మహిపతిరామలింగంతోపాటు మరో 13మంది పాలకవర్గసభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీ పదవీకాలం ముగిసిపోవడంతో నూతన కమిటీ ఎన్నిక జరగనుంది. ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వచ్చిన తర్వాత తొలిసారి పాలకవర్గం చైర్మన్‌గా గంగిరెడ్డి సుందర్‌రెడ్డి, రెండోసారి జీవీ భద్రం, మూడు, నాలుగోసారి కె.వెంకటేశ్వర్లు పదవీ బాధ్యతలు నిర్వహించారు.

2022, 2023లో ఐదు, ఆరోసారి కూడా పాలకవర్గం కమిటీ చైర్మన్‌గా మహిపతి రామలింగం బాధ్యతలు స్వీకరించారు. ఏడోసారి చైర్మన్ ఎవరో త్వరలో తేలనుంది.

నోటిఫికేషన్ జారీ...

పెద్దమ్మగుడి పాలకవర్గానికి చెందిన 14మంది డైరెక్టర్లుగా 2023 మార్చి 23న పదవీ బాధ్యతలు ముగిశాయి. ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దమ్మ గుడి ఈఓ ఎస్.రజనీకుమారి గత నెల 20వ తేదీన నూతన పాలకవర్గం నియమాకం కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. పెద్దమ్మగుడి పాలకవర్గం చైర్మన్ పదవి కోసం అధికార పార్టీకి చెందిన నాయకులు తమ అనుచరుల కోసం పోటీ పడుతున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయులు పోటీ పడుతున్నారు. చైర్మన్‌గిరీ ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఇల్లెందురూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు





టేకులపల్లి: పాతలచ్చగూడెంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, సులానగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

ఇల్లెందురూరల్: పోషకాహారం తీసుకున్న వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో శుక్రవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పాఠశాలల్లో క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇస్తున్నామని గుర్తు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతీరోజు కేంద్రానికి వచ్చి ఆహారం తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఆకుకూరలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

కార్యక్రమంలో ఏసీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కృష్ణవేణి, చంద్రకళ, ఉమ, వీరభద్రమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలు, కూరగాయలతో పౌష్టికాహారం..

టేకులపల్లి: ఆకుకూరలు, కూరగాయలు అంగన్‌వాడీలో అందించే పాలు, గుడ్లు, బాలామృతం, చిరుధాన్యాలతో పిల్లలు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం లభిస్తుందని వాటిని నిర్లక్ష్యం చేయకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.అనురాధ ఆధ్వర్యంలో బేతంపూడి స్టేజీ తండా అంగన్‌వాడీ కేంద్రంలో, సులానగర్ సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో సులాగనర్ అంగన్‌వాడీ కేంద్రంలో, గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో పాతలచ్చగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ మూడు సెక్టార్ల పరిధిలో జరిగిన కార్యక్రమానికి సీడీపీఓ హాజరై పరిశీలించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. మాట్లాడుతూ... మహిళ గర్భవతి అయిన నాటి నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు అంటే వెయ్యి రోజుల పాటు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, పిల్లల ఎదుగుదల బాగుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యశోద, సక్కుబాయి, మూడు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు సగుణ, లలిత, స్వరూప, అరుణ, వెంకటనర్సమ్మ, ఖలీదా, స్వరాజ్యలక్ష్మి, విజయ, లక్ష్మి, నాగేశ్వరమ్మ, ధనలక్ష్మి, ఈశ్వరమ్మ, మాలతి, సుజాత, సౌందర్య, రాంబాయి, రామలక్ష్మి, శాంత కుమారి, సమ్మక్క, నాగమణి పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెం అంగన్‌వాడీ సెంటర్–2లో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఉమాదేవి గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రతీ తల్లికి, పిల్లలకు ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ గర్భిణీ సమయానికి మందులు వేసుకోవాలని, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. తల్లీపిల్లలకు పౌష్టికాహారమే శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటరమణ, గోనె మణి, నందిని, రజిత, పద్మ, సరిత, రాణి, వెంకటలక్ష్మి, సీహెచ్ వనితారాణి పాల్గొన్నారు.